# ప్రజా [illegible]

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల  సంపుటి : 05  సంచిక : 226  పేజిలు : 04  వెల రూ. 2  మంగళవారం  10 - 03 - 2026



**లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి దొరికిన ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ ఎస్సైలు**

# రాజ్యసభ ఎంపీల ఎన్నిక ఏకగ్రీవం

- రాజ్యసభ ఎంపీలుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవం
- తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ఇద్దరు కాంగ్రెస్ అభ్యర్థులు
- నిబంధన ప్రకారం పది మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో స్క్రూటినీ దశలోనే సాయన్న నామినేషన్ తిరస్కరణ
- పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించిన అధికారులు
- మొదటిసారి ఎంపీగా వేం నరేందర్ రెడ్డి
- అభిషేక్ మను సింఘ్వీ దేశంలో అత్యంత సీనియర్ న్యాయవాదుల్లో ఒకరు
- వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి దిగే వరకు సీఎం సలహాదారుగా కొనసాగారు
- కాంగ్రెస్ పార్టీలో 16 మంది ఆశావహులు ఉన్నప్పటికీ వేం నరేందర్ రెడ్డినే అదృష్టం వరించింది



**హైదరాబాద్ :**
తెలంగాణ నుంచి రాజ్యసభకు ఇద్దరు కాంగ్రెస్ అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈరోజు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియగానే ఇద్దరు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఈనెల 16న నిర్వహించాల్సిన ఎన్నికల పోలింగ్ కూడా నిర్వహించాల్సిన పనిలేకుండా పోయింది.కాంగ్రెస్ పార్టీ తరఫున అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సాయన్న నామినేషన్ వేశారు. నిబంధన ప్రకారం పది మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో స్క్రూటినీ దశలోనే సాయన్న నామినేషన్ తిరస్కరణకు గురైంది. కాంగ్రెస్ తరఫున బరిలో దిగిన ఇద్దరు ఏకగ్రీవం కావడానికి మార్గం మరింత సుగమం అయింది. అభిషేక్ మను సింఘ్వీ దేశంలో అత్యంత సీనియర్ న్యాయవాదుల్లో ఒకరు. ఏఐసీసీ కోటా కింద తెలంగాణ నుంచి మరొకసారి ఆయనకు కాంగ్రెస్ అవకాశం కల్పించింది. - మిగతా 2 లో

# గచ్చిబౌలి స్టేడియంను అంతర్జాతీయ ప్రమాణాలతో పునర్నిర్మించాలి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అన్ని సౌకర్యాలతో స్పోర్ట్స్ వర్సిటీల నిర్మాణాలు
- క్రీడా శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష
- అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై అధికారులకు దిశానిర్దేశం
- యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీని సిద్ధం చేయాలని ఆదేశం
- మెగా ఈవెంట్లలో పతకాలు సాధించడమే లక్ష్యమన్న సీఎం
- ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ఉండాలన్న రేవంత్



**హైదరాబాద్ :**
క్రీడా శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేశారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీలో సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటు, ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వర్సిటీల నిర్మాణంపై చర్చించారు.అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశాలు : అన్ని సౌకర్యాలతో స్పోర్ట్స్ వర్సిటీల నిర్మాణాలు ఉండాలని, గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని - మిగతా 2 లో



2 లో

## ఆడబిడ్డల కన్నీళ్లు మీకు మంచిది కాదు

- ప్రభుత్వానికి కవిత వార్నింగ్
- ఖమ్మం వెలుగుమట్ల నిర్వాసితులను పరామర్శించిన కవిత
- టూరిస్ట్‌గా రాలేదు, సమస్య పరిష్కారమయ్యేవరకూ పోరాడతానని వెల్లడి
- కూల్చిన చోటే ఇళ్లు కట్టివ్వాలని ప్రభుత్వానికి డిమాండ్
- పేదల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని స్పష్టీకరణ



2 లో

## రాహుల్ బంధు కింద రేవంత్ రెడ్డి రూ.1000 కోట్లు పంపిస్తున్నారు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా
- కేసీఆర్ హయాంలో డిసెంబర్ నెలలో రైతుబంధు పడేదన్న కేటీఆర్
- ఇప్పుడు కోతల సమయం వచ్చినా రైతుబంధు పడలేదన్న కేటీఆర్
- రుణమాఫీ చేశానని అనుకుంటున్నానని రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరమని వ్యాఖ్య

## భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఇరాన్

- ఇరాన్ యుద్ధనౌకకు కొచ్చిలో ఆశ్రయం కల్పించడంపై భారత్‌కు టెహ్రాన్ కృతజ్ఞతలు
- రాజ్యసభలో పశ్చిమాసియా పరిణామాలపై కీలక ప్రకటన చేసిన జైశంకర్
- సాంకేతిక సమస్యల కారణంగా మానవతా దృక్పథంతోనే అనుమతి ఇచ్చామన్న మంత్రి
- శాంతియుత వాతావరణం, ఇంధన భద్రత, భారతీయుల రక్షణే తమ ప్రాధాన్యమని స్పష్టీకరణ
- సభలో విపక్షాల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడిన జేపీ నడ్డా



**ఢిల్లీ :**
పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ, కొచ్చి ఓడరేవులో తమ యుద్ధనౌకకు ఆశ్రయం కల్పించినందుకు భారత్‌కు ఇరాన్ కృతజ్ఞతలు తెలిపిందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు. సోమవారం నాడు రాజ్యసభలో పశ్చిమాసియా పరిస్థితులపై ఆయన కీలక ప్రకటన చేశారు.శ్రీలంక - మిగతా 2 లో






## దేశంలో మహిళా బిలియనీర్ ప్రజాప్రతినిధులు

- టాప్-3 ఏపీ నుంచే!
- దేశంలో 14 మంది మహిళా ప్రజాప్రతినిధులు బిలియనీర్లుగా గుర్తింపు
- అత్యంత సంపన్నుల జాబితాలో తొలి మూడు స్థానాలు ఏపీ ఎమ్మెల్యేలవే
- రూ.716 కోట్లతో టీడీపీ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి మొదటి స్థానం
- చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం కేవలం 10 శాతమేనన్న ఏడీఆర్
- తెలంగాణతో పోలిస్తే ఏపీ మహిళా ప్రజాప్రతినిధుల సగటు ఆస్తి చాలా అధికం

**అమరావతి :**
దేశ రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం, వారి ఆర్థిక స్థితిగతులపై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విడుదల చేసిన నివేదికలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. దేశవ్యాప్తంగా ఉన్న మహిళా ప్రజాప్రతినిధుల్లో (ఎంపీలు, ఎమ్మెల్యేలు) 14 మంది బిలియనీర్లు ఉండగా, వీరిలో అత్యంత సంపన్నుల జాబితాలో తొలి మూడు స్థానాలనూ ఏపీకి చెందిన ఎమ్మెల్యేలే కైవసం చేసుకోవడం గమనార్హం. వీరిలో టీడీపీకి చెందిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రూ.716 కోట్ల ఆస్తితో దేశంలోనే అత్యంత సంపన్న మహిళా ప్రజాప్రతినిధిగా మొదటి స్థానంలో నిలిచారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏడీఆర్ 'విమెన్ పొలిటికల్ పార్టిసిపేషన్ అండ్ రిప్రజెంటేషన్ ఇన్ ఇండియా' పేరుతో ఈ నివేదికను విడుదల చేసింది. 2024 సార్వత్రిక ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా ఈ విశ్లేషణ చేసింది. ఈ నివేదిక ప్రకారం రూ.716 కోట్ల ఆస్తితో - మిగతా 2 లో

# క్యూఆర్ కోడ్‌తో కొత్త పాసు పుస్తకాలు

- ఎవరు తప్పు చేసినా వెంటనే తెలుస్తోంది
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతున్నామన్న సీఎం
- ట్యాంపరింగ్ జరగకుండా కొత్త పాసుపుస్తకాలు
- కూటమి ప్రభుత్వంలో కరెంట్ ఛార్జీలు పెంచబోమని స్పష్టం
- ఒక్క పైసా కూడా అవినీతి లేకుండా పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు
- భవిష్యత్‌లోనూ ఎక్కడా తప్పులు జరగకుండా చూస్తామని హామీ
- నంద్యాల జిల్లా కొత్తబురుజు గ్రామసభలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీలో ముఖ్యమంత్రి
- ప్రజలు అభిమానించే పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు




**అమరావతి :**
ఒక్క పైసా కూడా అవినీతి లేకుండా పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతూ ట్యాంపరింగ్ జరగకుండా కొత్త పాసు పుస్తకాలు ఇస్తున్నామన్నారు. భవిష్యత్‌లోనూ ఎక్కడా తప్పులు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. నంద్యాల జిల్లా కొత్తబురుజు గ్రామసభలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. క్యూఆర్ కోడ్‌తో ఇచ్చే పాసు పుస్తకాలతో ఎవరు తప్పు చేసినా వెంటనే తెలుస్తోందన్నారు.రాయలసీమను రతనాల సీమగా మార్చుతాం: ప్రజలు అభిమానించే పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. సుస్థిరమైన పాలనతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ట్రూఅప్ పేరుతో ప్రజలపై భారం మోపిందన్న చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో కరెంట్ ఛార్జీలు పెంచమని పరిస్థితులు అనుకూలిస్తే తగ్గించే ప్రయత్నం చేస్తామని - మిగతా 2 లో

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్

- తాడేపల్లి వాసుల దశాబ్దాల కల సాకారం
- తాడేపల్లి రిటైనింగ్ వాల్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్
- రూ.294 కోట్లతో కృష్ణా నదికి వరద రక్షణ గోడ నిర్మాణం
- 50 వేల మందికి వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం
- పైల్-రాఫ్ట్ టెక్నాలజీతో భూకంపాలను తట్టుకునేలా నిర్మాణం
- నులకపేటలో రూ.65 లక్షలతో కమ్యూనిటీ హాల్ ప్రారంభం



**అమరావతి :**
ఏపీ మంత్రి నారా లోకేశ్ తన నియోజకవర్గం మంగళగిరి ప్రజలకు ఇచ్చిన మరో కీలక హామీని నెరవేర్చారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తాడేపల్లి రిటైనింగ్ వాల్ (వరద రక్షణ గోడ) నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.294.20 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలోనే పరిపాలన అనుమతులు, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులకు శ్రీకారం చుట్టడం గమనార్హం.ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణా నది కుడి వైపున 0.9 కి.మీ నుంచి 2.610 కి.మీ వరకు ఈ గోడను నిర్మించనున్నారు. సాధారణ గోడలా కాకుండా భూమిలోకి 26 నుంచి 38 మీటర్ల లోతు వరకు 1,920 పైల్స్ వేసి, ఆధునిక పైల్-రాఫ్ట్ సాంకేతికతతో దీన్ని నిర్మిస్తారు. భవిష్యత్తులో 15 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చినా, భూకంపాలు సంభవించినా తట్టుకునేలా దీన్ని డిజైన్ చేశారు.ఈ రిటైనింగ్ వాల్ నిర్మాణం - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఇరాన్ ధ్వంసం కావచ్చు కానీ ఒంటరిగా కాదు!



అమెరికాఇజ్రాయెల్ క్షిపణి దాడుల్లో తొలిరోజే చనిపోయిన సయ్యిద్ అలీ హుసైనీ ఖమేనీ గొప్ప ప్రజాదరణ పొందిన నేత ఏమీకాదు. నిస్సందేహంగా అతనొక నియంత. కానీ, అంతర్జాతీయ వ్యవహారాల్లో అమెరికా సామ్రాజ్యవాదానికి పచ్చి వ్యతిరేకి. ఇరాన్ చమురు కొనే దేశాలు ఆ మొత్తాన్ని తమ దేశ కరెన్సీలో చెల్లించవచ్చని పెద్ద ఆఫర్ ఇచ్చినవాడు, అమెరికా ఆర్థిక మనుగడకు ప్రాణప్రదమైన డాలర్ ఆధిపత్యానికి గట్టి సవాలు విసిరినవాడు ఖమేనీ. ఇరాక్ సద్దాం హుస్సేన్, లిబియా మువమ్మర్ గడాఫీల దారిలో అలీ ఖమేనీ కూడా ఇప్పుడు అమరవీరుల జాబితాలో చేరాడు. అంతర్జాతీయ చమురు వనరుల మీద అమెరికా గుత్తాధిపత్యాన్ని సాగించాలనుకుంటున్నది. అందులో భాగంగా రెండు నెలల క్రితం సైనిక చర్య ద్వారా వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, అతని భార్య సిలియా ఫ్లోరెస్‌లను కిడ్నాప్ చేసి అమెరికా జైలులో బంధించడాన్ని ప్రపంచం చూసింది. ఆ తరువాతి వంతు ఇరాన్ అగ్రనేతదే అని ప్రపంచం మొత్తానికీ తెలుసు. అలీ ఖమేనీకి కూడా తెలుసు. అయినా, అతడు భయపడలేదు. అమెరికాకు సరెండర్ కాలేదు. ఓ ట్రేడ్ డీల్ చేసుకుని దేశ ఆర్థిక వ్యవస్థను అమెరికాకు తాకట్టుపెట్టలేదు. భార్యా పిల్లలతో సహా చనిపోవడానికి సిద్ధపడ్డాడు; చనిపోయాడు. భారత ముస్లింలలో సున్నీలు 85 శాతం, షియాలు 15 శాతం. నేటి ఇరాన్ జనాభాలో షియాలు 9095 శాతం. సున్నీలు 510 శాతం. ధార్మిక శాఖా భేదాల ప్రకారం, భారత ముస్లింలు ఇరాన్‌ను వ్యతిరేకించాలి; సౌదీ అరేబియాను సమర్థించాలి. కానీ అలా జరగడం లేదు. భారత ముస్లింలు మాత్రమే కాదు, ప్రపంచ ముస్లింలు ఇప్పుడు సౌదీ అరేబియాను వ్యతిరేకిస్తూ ఇరాన్ పక్షం వహిస్తున్నారు! ఇక్కడ ధార్మిక శాఖా భేదాలకన్నా అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేకత ప్రధానంగా మారింది. ఇరాన్ ఇవ్వాళ అమెరికాఇజ్రాయెల్ కూటమితో మాత్రమే పోరాడడం లేదు. అమెరికాకు సైనిక స్థావరాలు ఏర్పాటు చేసిన సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్, కువైట్, ఖతర్, జోర్డాన్ తదితర ముస్లిం దేశాలతోనూ ఒకే సందర్భంలో పోరాడుతోంది. ఇరాక్‌లో పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడి ప్రభుత్వం ఈ యుద్ధానికి దూరంగా ఉండాలనుకుంటున్నది. అయితే, అక్కడి సైన్యం మీద ప్రభుత్వానికి పెద్దగా పట్టులేదు. అది ఇరాన్ పక్షం వహించాలనుకుంటున్నది. అదీగాక ఇరాక్‌లోని కతీబ్ హిజ్బొల్లా వంటి తీవ్రవాద సంస్థలు కూడా అమెరికా వ్యతిరేకతతో ఇరాన్‌కు మద్దతు పలుకుతున్నాయి. ఇరాన్‌లో చైనా పెట్టుబడులున్నాయి. ఆ దేశంతో భౌగోళిక, రాజకీయ అవసరాలున్నాయి. అయినప్పటికీ అమెరికాతో నేరుగా ఢీకొనడానికి చైనా సిద్ధంగా లేదు. అమెరికా దురుసుతనం మీద పరిమిత నిరసనను వ్యక్తం చేసి ఊరుకుంది. ఉక్రెయిన్ యుద్ధంలో మునిగి ఉన్న రష్యా సైతం తన మిత్రదేశమైన ఇరాన్‌కు ప్రత్యక్ష సహకారం అందించే స్థితిలో లేదు. కంటి తుడుపుగా మద్దతిచ్చి సరిపెట్టుకుంది. యుద్ధం వల్ల చమురు ధరలు పెరుగుతాయి కాబట్టి, అలా అందివచ్చిన అవకాశాన్ని వాడుకోవాలని పుతిన్ భావిస్తున్నారు. ఇరాక్‌ను ధ్వంసం చేయాలనుకున్నప్పుడు సద్దామ్ హుస్సేన్ జీవరసాయన ఆయుధాలను తయారు చేసి ప్రపంచ వినాశనానికి కుట్ర చేస్తున్నాడని అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్, యూకే ప్రధాని టోనీ బ్లెయిర్ తెగ ప్రచారం చేశారు. సద్దాం హుస్సేను ఉరి తీశాక, ఇరాక్ అంతటా వెతికినా అలాంటి ఆయుధాల జాడ ఎక్కడా కనిపించలేదు. వెనెజువెలా చమురును స్వాధీనం చేసుకోవాలనుకున్నప్పుడు ఆ దేశాధ్యక్షుడు మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నాడని అమెరికా ప్రచారం చేసింది. ఆ సంప్రదాయంలోనే ఇరాన్ అణ్వాయుధాలను పెద్ద ఎత్తున సిద్ధం చేస్తున్నట్టు కొన్నాళ్ళుగా అమెరికా ప్రచారం చేస్తున్నది. ఏకంగా దేశాధినేత చనిపోయినా సరే, వైరి దేశాలపై ఇరాన్ ఇప్పటిదాకా అణ్వాయుధాలను ప్రయోగించలేదంటే అర్థం ఏమిటి? అబద్ధాలను ప్రచారం చేయడంలో డొనాల్డ్ ట్రంప్ గత అమెరికా అధ్యక్షులందర్నీ మించిపోయారు. తానే ప్రపంచ పోలీసు, ప్రపంచ జడ్జి అనుకుంటున్నారు. ఇప్పుడైతే మరీనూ, తానో ప్రపంచ మొనగాడు అనుకుంటున్నారు. యుద్ధాలు మొదలుపెట్టడం సులభం; ముగించడం కష్టం. యుద్ధాలను మొదలు పెట్టినవారి లక్ష్యాలు నెరవేరుతాయని చెప్పడం కూడా కష్టమే. చరిత్ర చెప్పేది ఒకటే పెద్ద యుద్ధాలు ప్రత్యర్థిని మాత్రమే కాదు, ప్రారంభించిన వారినీ మార్చేస్తాయి. అమెరికాకు వియత్నాం ఎలా గుణపాఠమైందో, ఈ యుద్ధం కూడా అలాగే మరో అంతర్జాతీయ పాఠంగా మిగిలే అవకాశం ఉంది. ఈ యుద్ధంలో ఇరాన్ ధ్వంసం కావచ్చు; కానీ ఒంటరిగా అయితే కాదు!

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్

**మొదటిపేజీ తరువాయి** – పూర్తయితే తాడేపల్లి పరిధిలోని సుందరయ్య నగర్, మహానాడు కాలనీ సహా పలు లోతట్టు ప్రాంతాల్లోని సుమారు 50 వేల మంది ప్రజల వరద కష్టాలు శాశ్వతంగా తీరనున్నాయి. అంతేకాకుండా అమరావతిలోని కొన్ని ప్రాంతాలకు, జాతీయ రహదారి 65కు కూడా ఈ గోడ రక్షణగా నిలుస్తుంది. ఈ కార్యక్రమాలతో పాటు మంత్రి లోకేశ్ నులకపేటలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కూడా ప్రారంభించారు. శ్రీరంగం ఫౌండేషన్ సహకారంతో రూ.65 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఈ భవనాన్ని నిర్మించారు. నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన తెలిపారు.

## దేశంలో మహిళా బిలియనీర్ ప్రజాప్రతినిధులు

**మొదటిపేజీ తరువాయి** – ప్రశాంతి రెడ్డి మొదటి స్థానంలో ఉండగా, కడప టీడీపీ ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి రూ.388 కోట్ల ఆస్తితో రెండో స్థానంలో ఉన్నారు. ఇక, నెల్లిమర్ల నుంచి గెలిచిన జనసేన ఎమ్మెల్యే లోకం నాగమాధవి రూ.291 కోట్ల ఆస్తులతో మూడో స్థానంలో నిలిచారు. ఈ 14 మంది మహిళా బిలియనీర్ల మొత్తం ఆస్తి విలువ రూ.8,234 కోట్లుగా ఏడీఆర్ పేర్కొంది. ఈ నివేదిక చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న 4,666 మంది ప్రజాప్రతినిధుల్లో (ఎంపీలు, ఎమ్మెల్యేలు) మహిళలు కేవలం 464 మంది (10 శాతం) మాత్రమే ఉన్నారని తెలిపింది. లోక్‌సభలోని 543 మంది ఎంపీలలో 74 మంది మహిళలు ఉండగా, దేశంలోని 4,123 మంది ఎమ్మెల్యేలలో 390 మంది మహిళలున్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తుల విషయంలోనూ ఏడీఆర్ ఆసక్తికరమైన పోలికను చూపింది. ఏపీలో ఉన్న 24 మంది మహిళా ప్రజాప్రతినిధుల సగటు ఆస్తి రూ.74 కోట్లుగా ఉండగా, తెలంగాణలోని 11 మంది మహిళా ప్రజాప్రతినిధుల సగటు ఆస్తి కేవలం రూ.14 కోట్లుగానే ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. మొత్తం మీద ఒకవైపు మహిళా ప్రాతినిధ్యం తక్కువగా ఉన్నప్పటికీ, రాజకీయాల్లో ఉన్న కొద్దిమంది మహిళల్లో కొందరు అత్యంత సంపన్నులుగా ఉండటం ఈ నివేదిక ద్వారా స్పష్టమైంది.

## గచ్చిబౌలి స్టేడియంను అంతర్జాతీయ ప్రమాణాలతో పునర్నిర్మించాలి



**మొదటిపేజీ తరువాయి** – అధికారులకు రేవంత్ రెడ్డి సూచించారు. వర్సిటీ నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించిన సీఎం, డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఒలింపిక్స్, కామన్‌వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. 3 స్టేడియాలను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునీకీకరించాలని ఆదేశాలు జారీ చేశారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం ఆధునికీకరించాలని, ఎల్బీ స్టేడియం, సరూర్‌నగర్ స్టేడియాన్ని ఆధునికీకరించాలని, భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునికీకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రీడా శాఖ సమీక్షలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# క్యూఆర్ కోడ్‌తో కొత్త పాసు పుస్తకాలు




**మొదటిపేజీ తరువాయి** – ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చారు. రాయలసీమను రతనాల సీమగా మార్చి, ఉద్యానవనంగా చేసి చూపిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. ఇక్కడి ఉత్పత్తులకు ప్రపంచస్థాయిలో మార్కెట్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో మద్యాన్ని కల్తీ చేసి వేల మందిని పొట్టన పెట్టుకున్నారు. పేదవాడి ఆరోగ్యం కంటే వాళ్లకు డబ్బులే ముఖ్యమా? తిరుమల ప్రసాదాన్ని కూడా కల్తీ చేశారు. తిరుమల పవిత్రతను దెబ్బతీయాలని చూశారు. వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేయాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించను. ఇతర మతాల సంప్రదాయాలను కాపాడతాం. కుట్రపూరితంగా మత విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తే ఊరుకునేది లేదు. ప్రజల జీవితాలు, ఆరోగ్యంతో ఆడుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో అంతా కల్తీ కుంభకోణాలే. ముఠాలు వద్దు గ్రామాల ప్రశాంతతే ముద్దు అని అందర్నీ కలిపా. రౌడీయిజం, ముఠా కక్షలు లేకుండా చేశాం. రాయలసీమను రతనాల సీమగా మారుస్తా. ఉద్యానవనంగా చేసి చూపిస్తాం. ఇక్కడి ఉత్పత్తులకు ప్రపంచస్థాయి లో మార్కెట్ కల్పిస్తాం. ఆనాడు ఐటీ యుగం, ఇవాళ ఏఐ యుగం: ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగువాళ్లు ఉంటారని, నాడు ఐటీని అభివృద్ధి చేయడం వల్ల చాలామందికి ప్రయోజనం చేకూరిందని సీఎం అన్నారు. ఆనాడు ఐటీ యుగం, ఇవాళ ఏఐ యుగం అని చంద్రబాబు వివరించారు. ఏపీకి పెట్టుబడులు భారీగా వస్తున్నాయని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. జనాభా ఉంటేనే ఏదైనా: దేశంలో ఇదివరకు పెద్ద కుటుంబాలు ఉండేవని, దాన్నే ఆస్తిగా భావించేవాళ్లని సీఎం అన్నారు. ఇప్పుడు కుటుంబాలు కుచించుకు పోయాయని గతంలో తానూ కుటుంబ నియంత్రణను ప్రోత్సహించానని ఆయన తెలిపారు. కానీ ఇప్పుడు కాలం మారిందని, పరిస్థితులు మారాయని జనాభా ఉంటేనే ఏదైనా ఉపయో గించుకునేందుకు వీలుంటుందని సీఎం వెల్లడించారు.

# రాజ్యసభ ఎంపీల ఎన్నిక ఏకగ్రీవం



**మొదటిపేజీ తరువాయి** – వేం నరేందర్ రెడ్డితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతో నరేందర్ రెడ్డికి రాజ్యసభ ఎంపీ పదవి రావడానికి ముఖ్యమంత్రే ప్రధాన కారణమని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి దిగే వరకు సీఎం సలహాదారుగా కొనసాగారు. నామినేషన్ నిబంధనల మేరకు ఆయన ముఖ్యమంత్రి సలహాదారు పదవికి రాజీనామా చేసి నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో భారీ సంఖ్యలో ఏకంగా 16 మంది ఆశావహులు ఉన్నప్పటికీ వేం నరేందర్ రెడ్డినే అదృష్టం వరించింది. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌లు అంతా ముక్తకంఠంతో మద్దతు పలకడంతోపాటు సీఎం రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించి వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ అభ్యర్థిత్వం ఖరారు అయ్యేట్లు చేశారు. వేం నరేందర్ రెడ్డి వ్యవసాయ కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆయన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామవాసి. 67 ఏళ్ల వయస్సున్న నరేందర్ రెడ్డికి రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. 2004లో మహబూబాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. నరేందర్ రెడ్డి దాఖలు చేసిన అఫిడవిట్‌లో తన ఆస్తులు, అప్పులను వెల్లడించారు. తన వార్షికాదాయం రూ.6 లక్షలుగా చూపారు. 2024-25 ఆర్థిక ఏడాదికి రూ. 22 లక్షలకు పెరిగింది. ఆయన సతీమణి ఆదాయం రూ.10 లక్షలపైన ఉన్నట్లు పేర్కొన్నారు. హెచ్‌యూఎఫ్ ద్వారా మరో రూ.12 లక్షల ఆదాయం ఉన్నట్లు తెలిపారు. అంతా కలిపితే కుటుంబం మొత్తం వార్షిక ఆదాయం దాదాపు రూ.45 లక్షలుగా పేర్కొన్నారు. మొదటి నుంచీ టీడీపీలో ఉన్న వేం నరేందర్ రెడ్డికి రేవంత్ రెడ్డి కూడా ఆ పార్టీలో చేరాక ఆయనతో దగ్గరి సాన్నిహిత్యం ఏర్పడింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే ప్రక్రియలో నరేందర్ రెడ్డి నాటి పీసీసీ అధ్యక్షుడైన రేవంత్ రెడ్డి వెన్నంటే ఉన్నారు. ఆర్థికసాయం దగ్గరి నుంచి మొదలుకొంటే అన్నింటిలో తోడున్నారని రాజకీయవర్గాల వారు మాట్లాడుకుంటుంటారు. గతంలోనే నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీ చేయాలని సీఎం ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరిగింది. కానీ కాంగ్రెస్ పార్టీలో పదవులు తక్కువగా పోటీ ఎక్కువ. ఎంతంటే ఒక్క రాజ్యసభ సీటుకు ఏకంగా 16 మంది సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోటీ పడ్డారంటే అర్థం చేసుకోవచ్చు.

# భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఇరాన్



**మొదటిపేజీ తరువాయి** – సమీపంలో ఇరాన్‌కు చెందిన 'ఐఆర్ఐఎస్ దేనా' యుద్ధనౌక అమెరికా జలాంతర్గామి దాడికి గురై మునిగిపోయిన సంగతి తెలిసిందే. సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్న మరో ఇరాన్ యుద్ధనౌక 'ఐఆర్ఐఎస్ లావన్' భారత్ సాయం కోరింది. అందుకు భారత్ వెంటనే స్పందించి, కొచ్చి పోర్టులో డాక్ చేసేందుకు అంగీకరించింది. దీనిపై స్పందించిన జైశంకర్.. "ఫిబ్రవరి 20న ఇరాన్ మూడు నౌకల కోసం అనుమతి కోరగా, మార్చి 1న కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో మార్చి 4న కొచ్చికి చేరుకున్న ఆ నౌక సిబ్బందికి ప్రస్తుతం భారత నౌకాదళ కేంద్రాల్లో ఆశ్రయం కల్పిస్తున్నాం. మానవతా దృక్పథంతో తీసుకున్న ఈ నిర్ణయం సరైనదే" అని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 20, మార్చి 5 తేదీల్లో ఇరాన్ విదేశాంగ మంత్రి అరాఘ్చీతో తాను మాట్లాడినట్లు ఆయన సభకు తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభంపై భారత్ మూడు విధానాలకు కట్టుబడి ఉందన్నారు. చర్చల ద్వారా శాంతిని నెలకొల్పడం, ఆ ప్రాంతంలో ఉన్న భారతీయుల భద్రత, అలాగే దేశ ఇంధన భద్రత, వాణిజ్య ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. మరోవైపు, జైశంకర్ ప్రకటన సమయంలో విపక్షాలు వ్యవహరించిన తీరుపై సభా నాయకుడు జేపీ నడ్డా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విపక్షాలకు జాతీయ ప్రయోజనాల కంటే రాజకీయాలు, సభలో గందరగోళం సృష్టించడం మీదే ఆసక్తి ఎక్కువని విమర్శించారు. గతంలో వక్ఫ్ బిల్లు, బడ్జెట్ సమావేశాలు, ఆపరేషన్ సిందూర్ వంటి కీలక అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు కూడా విపక్షాలు ఇలాగే సభ నుంచి వాకౌట్ చేశాయని ఆయన గుర్తుచేశారు. ఆత్మనిర్భర్ భారత్ పట్ల వారికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని నడ్డా ధ్వజమెత్తారు.

# బంగ్లాదేశ్‌లో హిందూ బాలుడి దారుణ హత్య



**మొదటిపేజీ తరువాయి** – బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందువులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఫెనీ జిల్లాలో ఆటోను దొంగిలించేందుకు యత్నించిన కొందరు దుండగులు, 16 ఏళ్ల హిందూ బాలుడిని దారుణంగా హత్య చేశారు. ఢాకా-చిట్టగాంగ్ హైవేపై లాల్‌పోల్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మృతుడిని శాంతో కుమార్ సాహాగా గుర్తించారు. స్థానిక మీడియా 'జాగోన్యూస్24' కథనం ప్రకారం.. మియాజీ ఫిల్లింగ్ స్టేషన్ ముందు ఆటోలో ప్రయాణికుడి కోసం శాంతో ఎదురుచూస్తున్నాడు. కాసేపటికి కొందరు దుండగులు అతడిపై దాడి చేసి, ఆటోను లాక్కునే క్రమంలో హైవే పక్కన ఉన్న కల్వర్టు కిందకి విసిరేశారు. అక్కడి నుంచి తేరుకుని దొంగలను వెంబడించిన శాంతోను వారు కదులుతున్న వాహనం కిందకి తోసేశారు. దీంతో వాహనం ఢీకొని బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. రాత్రి వరకు బాలుడి ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు గాలిస్తుండగా, తెలిసిన ఆటో డ్రైవర్ ద్వారా సమాచారం అందినట్లు శాంతో బంధువులు తెలిపారు. ప్రయాణికులను ఎక్కించుకున్న ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తే నిందితులను గుర్తించవచ్చని వారు కోరుతున్నారు. ఇఫ్తార్ సమయంలో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని ఆసరాగా తీసుకుని బాలుడిని టార్గెట్ చేసి ఆటోను హైజాక్ చేశారని వారు ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో కొత్తగా ఏర్పడిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్ పీ) ప్రభుత్వ హయాంలోనూ హిందూ వర్గాలపై దాడులు ఆందోళనకరంగా పెరుగుతుండటం గమనార్హం. గతంలో మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వ 18 నెలల పాలనలోనూ మైనారిటీలపై దాడులు కొనసాగిన విషయం తెలిసిందే.

## ఆడబిడ్డల కన్నీళ్లు మీకు మంచిది కాదు



**మొదటిపేజీ తరువాయి** – ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతల బాధితులను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇవాళ పరామర్శించారు. ఇళ్లు కోల్పోయి కన్నీరు పెట్టుకుంటున్న మహిళలను చూసి ఆమె చలించిపోయారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఆడబిడ్డల దుఃఖం, వారి కన్నీళ్లు ప్రభుత్వానికి మంచిది కాదని హెచ్చరించారు. "నేను టూరిస్ట్‌ను కాదు. మీ సమస్యకు పరిష్కారం చూపేవరకూ ఇక్కడే ఉండి పోరాడతా" అని కవిత బాధితులకు భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్, మంత్రులు తక్షణమే వెలుగుమట్లకు వచ్చి బాధితులతో మాట్లాడి, వారి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లపై బుల్డోజర్లు పంపడం అన్యాయమని మండిపడ్డారు. కొన్ని రాజకీయ పార్టీలు ఈ దుఃఖాన్ని కూడా రాజకీయం కోసం వాడుకుంటున్నాయని ఆమె ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ వాళ్లు కూడా ఇళ్లు కూల్చడానికి ప్రయత్నాలు చేశారని కవిత అన్నారు. ఎక్కడైతే ఇళ్లు కూల్చివేశారో అక్కడే తిరిగి స్థలాలు ఇచ్చి, ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు, సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికేంత వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని కవిత స్పష్టం చేశారు.

## రాహుల్ బంధు కింద రేవంత్ రెడ్డి రూ.1000 కోట్లు పంపిస్తున్నారు



**మొదటిపేజీ తరువాయి** – 'రాహుల్ బంధు' పథకం కింద ప్రతి సంవత్సరం రూ.1000 కోట్లు ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సిరిసిల్లలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో డిసెంబర్ నెలలో రైతుబంధు పడేదని, కానీ ఇప్పుడు కోతల సమయం వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం వేయలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనలో రైతుబంధును నిలిపివేసి 'రాహుల్ బంధు' పేరుతో కొత్త పథకం తెచ్చారని ఎద్దేవా చేశారు. తన పదవిని కాపాడుకోవడం కోసం రేవంత్ రాహుల్ బంధు పథకం కింద గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తున్నాడని ఆరోపించారు. అందుకే కేసీఆర్ ముందే చెప్పారని, ఆలోచించి జాగ్రత్తగా ఓటు వేయాలని సూచించారని తెలిపారు. రేవంత్ రెడ్డి మూడుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారని విమర్శించారు. "నేను రుణమాఫీ చేశానని అనుకుంటున్నా, రైతుబంధు వేశానని అనుకుంటున్నా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల అన్నారని, అసలు ఆయన ముఖ్యమంత్రేనా అని నిలదీశారు. మరి ముఖ్యమంత్రిగా మీరెందుకు ఉన్నారని ప్రశ్నించారు. రైతుబంధు వేస్తే, రుణమాఫీ ఇస్తే మీకు తెలియకుండా ఉండటమేమిటని అన్నారు. హైదరాబాద్‌లో దోమలు బాగా పెరిగిపోయాయని, కానీ నగరంలో చెత్తను మాత్రం తీయడం లేదని విమర్శించారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం

-- డాక్టర్ సుభాషిని కి జాతీయ పురస్కారం



**సికింద్రాబాద్, మార్చి 09 ( ప్రజామంటలు ):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సమాజానికి చేసిన విశేష సేవలకు గాను హైకోర్టు న్యాయవాది డాక్టర్ సుభాషిని జాతీయ పురస్కారంతో సత్కరించబడ్డారు. శంకర్ ఫౌండేషన్ మరియు భారత సాహిత్య ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన హైకోర్టు న్యాయమూర్తులు రజిని, చంద్రకుమార్ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు.మహిళలు, పిల్లలు, యువత సంక్షేమం కోసం నాలుగు దశాబ్దాలకు పైగా అహర్నిశలు సేవలందిస్తున్న డాక్టర్ సుభాషిని న్యాయరంగంలో కూడా విశేష అనుభవం కలిగినవారు. ఎల్.ఎల్.బి, ఎల్.ఎల్.ఎమ్, పీజీ డిప్లొమా ఇన్ ఆర్బిట్రేషన్, పీహెచ్‌డీ ఇన్ లా వంటి ఉన్నత విద్యార్హతలతో న్యాయ అవగాహన శిబిరాలు, మహిళా సాధికారత కార్యక్రమాలు, యువత అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి సేవలందిస్తున్నారు. ప్రస్తుతం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షురాలిగా కూడా పనిచేస్తున్నారు.సమాజంలో న్యాయం, సమానత్వం, మానవ విలువలను ప్రోత్సహిస్తూ ఆమె అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ జాతీయ పురస్కారం ప్రదానం చేశారు.

# కొండాపూర్‌లో 'ఆయు జెరియాట్రిక్స్' ప్రారంభం




**సికింద్రాబాద్, మార్చి 09 ( ప్రజామంటలు):** నగరంలోని వృద్ధుల సంరక్షణకు కొత్త దారితీస్తూ కొండాపూర్‌లో 'ఆయు జెరియాట్రిక్స్' పేరుతో డేకేర్, వెల్నెస్ సెంటర్ ప్రారంభమైంది. 18 ఏళ్ల క్లినికల్ అనుభవం కలిగిన వైద్యులు డాక్టర్ ఆరతి బెల్లారి, డాక్టర్ హారిక సూరపనేని సంయుక్తంగా ఈ కేంద్రాన్ని స్థాపించారు.ప్రారంభోత్సవానికి దొబారా వ్యవస్థాపకురాలు మతీన్ అన్సారీ, పద్మశ్రీ గ్రహీత ఆనంద శంకర్ జయంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వృద్ధులకు వైద్య పర్యవేక్షణతో పాటు ఫిజియోథెరపీ, యోగా, ఆరోగ్య పరీక్షలు, మానసిక చురుకుదనం పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వృద్ధులు ఆరోగ్యంగా, చురుకుగా జీవించేందుకు ఈ కేంద్రం తోడ్పడుతుందని పేర్కొన్నారు.

# దళిత శిశువు హత్య ఘటన, 110 ఏళ్ల స్వాతంత్ర్య

సమరయోధుడు పరిస్థితిపై మానవ హక్కుల కమిషన్ చర్యలు






**హైదరాబాద్, మార్చి 09 (ప్రజా మంటలు):** నాగర్ కర్నూల్ జిల్లాలో రెండు నెలల దళిత శిశువు హత్య ఘటనతో పాటు 110 ఏళ్ల స్వాతంత్ర్య సమరయోధుడు ఉంగరాల యాదగిరి గారి పరిస్థితిపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (౬+ఎ=జ) చర్యలు చేపట్టింది.నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రెండు నెలల పసికందు హత్య చేయబడిన ఘటనతో పాటు దళిత కుటుంబ సభ్యులపై దాడి జరిగినట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీజేఏసీ ప్రతినిధులు కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కుల ఆధారిత వేధింపులు, శారీరక దాడులు జరిగినట్లు, అలాగే నిందితులపై సరైన కేసులు నమోదు చేయడంలో మరియు అరెస్టు చేయడంలో స్థానిక పోలీసులు నిర్లక్ష్యం వహించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర నివేదిక సమర్పించాలని కమిషన్ తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ను ఆదేశించింది. ఈ కేసు తదుపరి పరిశీలన కోసం 24 మార్చి 2026 వరకు నివేదిక కోరింది.అదే సమయంలో, పత్రికల్లో ప్రచురితమైన వార్తల ఆధారంగా 110 ఏళ్ల స్వాతంత్ర్య సమరయోధుడు ఉంగరాల యాదగిరి గారి పరిస్థితిపై కూడా కమిషన్ సుమోటో కేసు నమోదు చేసింది. యాదాద్రి-భువనగిరి జిల్లా వలిగొండ మండలం కేశిపల్లి గ్రామానికి చెందిన యాదగిరి గారు కుమారుల నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం ఉప్పల్‌బోడుప్పల్ ప్రాంతంలోని వృద్ధాశ్రమంలో నివసిస్తున్నట్లు వార్తల్లో వెల్లడైంది. ఈ ఘటనపై నివేదిక సమర్పించాలని యాదాద్రి-భువనగిరి జిల్లా కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది. కేసును తదుపరి విచారణ కోసం 06 ఏప్రిల్ 2026కు వాయిదా వేసింది.

# మొక్క జొన్న కొనుగోలు కేంద్ర ఏర్పాటు కు

వ్యవసాయ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల మార్చ్ 9(ప్రజా మంటలు) :** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని వారి కార్యాలయంలో కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జగిత్యాల నియోజకవర్గం లో మొక్కజొన్న పంట అధిక మొత్తంలో సాగు చేయడం జరిగిందని మొక్కజొన్న పంట కోత దశకు వచ్చినందున రైతులకు ఇబ్బంది లేకుండా,దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ద్వారా మార్క్ ఫెడ్ ఆద్వర్యం లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని కోరగా, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు మార్క్ ఫెడ్ ఆద్వర్యం లో ఏర్పాటు చేయటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు.

# రాజ్య సభ సభ్యుడు నరేందర్ రెడ్డిని

ఎమ్మెల్యేసంజయ్ ద్వారా కలిసిన కన్నాపూర్ సర్పంచ్



**జగిత్యాల మార్చ్ 9(ప్రజా మంటలు)** :రూరల్ మండలం కన్నపూర్ గ్రామ సర్పంచ్ పొట్టవత్తిని సతీష్ హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్స్ లో జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ద్వారా రాజ్యసభ సభ్యులైన వేం నరేందర్ రెడ్డి ని మర్యాదపూర్వంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది మరియు కరీంనగర్ ఇంచార్జ్ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ని మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా కన్నాపూర్ గ్రామ అభివృద్ధికి నిధుల కోసం మంజూరూ చేయాలని సర్పంచ్ కోరడం జరిగింది.

# ఖమ్మంలో కల్వకుంట్ల కవిత అరెస్ట్

మహిళా కానిస్టేబుళ్లు లేకుండానే అరెస్టుపై వివాదం






**ఖమ్మం, మార్చి 09 (ప్రజా మంటలు):** వెలుగుమట్ల బాధితులకు మద్దతుగా ఖమ్మం జెడ్పీ సెంటర్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమెతో పాటు ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, వెలుగుమట్ల బాధితులు మరియు జాగృతి నాయకులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.కవితతో పాటు పలువురు మహిళలను మహిళా కానిస్టేబుళ్లు లేకుండానే పోలీసులు అరెస్ట్ చేశారని తెలంగాణ జాగృతి నాయకులు ఆరోపించారు. ఈ ఘటనపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.అరెస్ట్ అనంతరం కల్వకుంట్ల కవితను ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించగా, వెలుగుమట్ల బాధితులు మరియు జాగృతి నాయకులను రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటనలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ జాగృతి నాయకులు మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

# 10వ తరగతి విద్యార్థులకు మోటివేషనల్ తరగతులు

అండ్ ఎక్సామ్ ప్యాడ్స్ పంపిణీ



**జగిత్యాల మార్చ్9(ప్రజా మంటలు) :** "శ్రీ సత్యసాయి సేవా సమితి,జగిత్యాల" ఆధ్వర్యంలో స్థానిక తాటిపల్లి జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్ యందు 10వ తరగతి విద్యార్థులకు "మోటివేషనల్ తరగతులను" నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా గోల్ సెట్టింగ్ ఐడియాస్‌సక్సెస్ మంత్రసెల్ఫ్ కాన్ఫిడెన్స్‌ఎక్సామ్ ప్రిపేరషన్‌మోరల్ వాల్యూస్‌తదితర అంశాలను చక్కని ఉదాహారణలతో కన్వీనర్ మరియు సీనియర్ కన్వీనర్ వివరించడం జరిగింది.తదనంతరం స్వామి వారి చిరు కానుక గా పిల్లలందరికీ ఎక్సామ్ పాడ్స్, పెన్స్ బిస్కట్ పాకెట్స్ అందచేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సత్యసాయి సంస్థ తరపున కన్వీనర్ బట్టు రాజేందర్ , చిటుమల్ల లక్ష్మీనారాయణ , వంగల లక్ష్మీనారాయణ , గూడూరు మురళీధర్ రావు అలాగే పాఠశాల తరపున ఉపాధ్యాయులు లతీఫ్ , కూరగాయల చంద్రశేఖర్ , గంగారాం , సవిత , సునీత , దేవి , శ్రీకాంత్ పాల్గొన్నారు.

# జిల్లా వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడిగా సుధాకర్ నియామకం



**భీమదేవరపల్లి మార్చి 9 (ప్రజా మంటలు) :** తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడిగా ముల్కనూర్ గ్రామానికి చెందిన వల్లపు సుధాకర్‌ను నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలుమల్లు మల్లు ఆదేశాల మేరకు గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పూర్తి స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండికోట వెంకన్న, రాష్ట్ర కార్యదర్శి పల్లపు వెంకటేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లపు మల్లికార్జున్ ఆధ్వర్యంలో సుధాకర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర సంఘం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాజీపేట్ పట్టణ నగర్ అధ్యక్షుడు వల్లపు వెంకన్న, కాజీపేట్ మండల అధ్యక్షుడు కందిరాజు, శివరాత్రి రాజు, ఇరగదిండ్ల రాజమౌళి, కస్తూరి ఐలయ్య, కస్తూరి అనిల్, వల్లపు కిషన్, చోటు, కస్తూరి రాజశేఖర్, బొమ్మిశెట్టి ఐలయ్య, బొంత వంశీ, తేజ తదితర వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పుష్కరాలకు వచ్చేభక్తులకు అసౌకర్యం కలగకుండా

ఏర్పాట్లు చేయాలి మంత్రి అడ్లూరి



**జగిత్యాల మార్చ్ 9 ( ప్రజా మంటలు):** పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ అన్నారు.2027లో జరగనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్ల నేపథ్యంలో చేపట్టాల్సిన భూసేకరణ (ల్యాండ్ అక్విజిషన్) మరియు దేవాలయ అభివృద్ధి పనులపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మరియు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూరానున్న గోదావరి పుష్కరాలు రాష్ట్రానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని తెలిపారు. పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారని పేర్కొన్నారు. అందువల్ల భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పుష్కరాలకు అవసరమైన భూముల సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ2027 గోదావరి పుష్కరాల సందర్భంగా ధర్మపురి క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఘాట్లు, రహదారులు, పార్కింగ్ స్థలాలు, తాగునీరు, పారిశుధ్యం, భద్రత వంటి మౌలిక సదుపాయాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పుష్కరాల ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, దేవాలయ ఈఓ, తహసీల్దార్ మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**భీమదేవరపల్లి మార్చి 09 (ప్రజా మంటలు) :** కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు మరియు ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మూడు దశల పోరాటంలో భాగంగా సోమవారం భీమదేవరపల్లి మండల విద్య వనరుల కేంద్రం, కేజీబీవీలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె కాలంలో బకాయి ఉన్న 29 రోజుల వేతనాన్ని వెంటనే చెల్లించాలని, అలాగే ఉద్యోగాలకు మినిమం టైమ్ స్కేలు ప్రకారం వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల ఇతర సమస్యలను కూడా తక్షణమే పరిష్కరించాలని కోరారు. అలాగే ఈ నెల 16న జిల్లా, డివిజన్ స్థాయిలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలు మరియు 20న చేపట్టనున్న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులను పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ జ్యోతి, ఉపాధ్యాయ బృందం, సమగ్ర శిక్ష ఉద్యోగులు రాజన్ నాయక్, మహేందర్, రఘుబాబు, శ్రీకాంత్, హిమసాగర్, శాంత తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి నది తీరం పరిశీలన

ధర్మపురి పట్టణ కేంద్రంలోని లోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**ధర్మపురి మార్చ్ 9 (ప్రజా మంటలు) :** పట్టణంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పర్యటించి గోదావరి తీరంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ముందుగా గోదావరి తీరం వద్ద పారిశుధ్య పరిస్థితులను ఆయన పరిశీలించి అక్కడ నిర్వహిస్తున్న శుభ్రత పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోదావరి తీరం వద్దకు పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు వచ్చే నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యం శుభ్రత పనులు నిర్వహిస్తూ ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించాలని ఆదేశించారు. స్నాన ఘాట్ల పనులపై తగిన శ్రద్ధ వహించి భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.అనంతరం ధర్మపురి పట్టణ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఓ పి సేవలు, ఐపీ సేవలు రికార్డ్స్ ల్యాబ్ రికార్డ్స్ ఐపీ రికార్డ్స్ మెడికల్ ఫార్మసి పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్‌ఆసుపత్రిలో వైద్య సేవలను గురించి నేరుగా పేషంట్లని వివరాలు అడిగి తెలుసుకున్నారు.వైద్య సేవలు మెరుగు పరచాలని డాక్టర్లు సమయ పాలన పాటించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో ముందస్తు వ్యాధుల పట్ల డెంగ్యూ వైరల్ ఫీవర్లకు మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్లను వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని వున్న మంచినీటి సౌకర్యాలను ఎప్పటికప్పుడు నాణ్యతమైన వంట సామాగ్రి మంచి భోజనం అందించాలి ఆదేశించారు. ఈ పరిశీలనలో రెవెన్యూ డివిజనల్ అధికారి మధు సూదన్, జిల్లా ఆస్పత్రి కోఆర్డినేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ , మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వో, ఆస్పత్రి సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిశీలించాలి




**జగిత్యాల మార్చ్ 9(ప్రజా మంటలు)** :ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత అదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత మాట్లాడుతూపలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 56 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల, మెట్ పెల్లి , ఆర్డీవోలు జీవాకర్ రెడ్డి, నరసింహా రావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



**జగిత్యాల మార్చ్ 9 ( ప్రజా మంటలు)** :గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రొసీడింగ్స్ అందజేతజిల్లాలో మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబనను ప్రోత్సహించేందుకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడంతో పాటు గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రేషియా సహాయం అందజేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గతో కలిసి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లు లబ్ధిదారులకు కుట్టు మిషన్లను పంపిణీ చేసి, గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా సహాయానికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను అందజేశారు.గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లి అనుకోని పరిస్థితుల్లో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వారు తెలిపారు. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా సహాయం అందజేయడం ద్వారా వారికి కొంత ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.జిల్లాలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు కూడా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని తమ జీవితాలను మెరుగుపరుచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా మైనారిటీ అధికారి చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వెలుగుమట్ల బాధితులకు మద్దతుగా కల్వకుంట్ల కవిత

నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభం



**ఖమ్మం, మార్చ్ 9 (ప్రజా మంటలు):** ఖమ్మం పోలీస్ స్టేషన్ నుంచి విడుదలైన అనంతరం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అంబేద్కర్ భవన్‌లో వెలుగుమట్ల బాధితులతో కలిసి నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు.ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడిన ఆమె, తెలంగాణ జాగృతి, ఎస్సీఎస్టీబీసీ జేఏసీ, ధర్మసమాజ్ పార్టీ కలిసి వెలుగుమట్ల బాధితులకు మద్దతుగా ఆందోళన చేపట్టామని తెలిపారు.బాధితుల సమస్యను ఇప్పటివరకు ఏ పార్టీ, ఏ సంస్థ చెప్పని విధంగా బలంగా వినిపించామని ఆమె పేర్కొన్నారు. వారి సమస్యలు, ఆకాంక్షలను రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.ఈ సమస్యకు పరిష్కారం దొరికే వరకు వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తామని భూ నిర్వాసితులకు హామీ ఇచ్చారు.బాధితుల ఇళ్లను ఎక్కడ కూల్చారో అక్కడే తిరిగి నిర్మించాలని ఆమె డిమాండ్ చేశారు. అది ప్రభుత్వ భూమి కాదని, భూదాన్ భూమి అని తెలిపారు. భూదాన్ భూమి అంటే పేద ప్రజలకు పంచాల్సిన భూమి అని స్పష్టం చేశారు.బాధితులకు ఇళ్లు కట్టించే వరకు తమ పోరాటం ఆగదని, నిరంతరం కొనసాగుతుందని కల్వకుంట్ల కవిత తెలిపారు.

# ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం - ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న మహిళలు

**మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం**

**ప్రోత్సాహానికి ప్రజల నుంచి విశేష స్పందన**

**ఇవ్వన్నీ 2047 లక్ష్యాలను చేరేందుకే చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు**




స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను తీసుకుని చిన్న, మధ్య తరహా పరిశ్రమలను పలువురు మహిళలు నెలకొల్పుతున్నారు. మరికొంత మంది వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మెప్మా ద్వారా నగరాల్లో అవసరమైన మహిళలకు రుణాలను అందిస్తూ వారిని పారిశ్రామిక, వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు. వ్యాపారంగంలోకి మహిళలు: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత పరిధిలో స్వయం సహాయక సంఘాలు 8 లక్షల 33 వేల 235 ఉన్నాయి. వీటిలో 83 లక్షల 2 వేల 889 మంది సభ్యులున్నారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంత పరిధిలో 3వేల 79 కోట్ల రూపాయల రుణాలు అందజేశారు. అదే పట్టణ ప్రాంతానికి సంబంధించి 123 పట్టణ స్థానిక సంస్థల్లో 2.47 లక్షల స్వయం సహాయక సంఘాలుండగా వీటిలో 22లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీళ్లందరికీ ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తూ పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపార వేత్తలుగా అభివృద్ధి అయ్యేందుకు ప్రోత్సహిస్తోంది. దీంతో మహిళలు వివిధ రకాల వ్యాపారాలు ప్రారంభించి లాభాలు సంపాదిస్తూ మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.మహిళలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో మహిళా పారిశ్రామిక వేత్తలకు మంచి ప్రోత్సాహం అందుతోందని డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టితో తమను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేయడం పట్ల వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సరైన సపోర్ట్ లేక ఇతర ప్రాంతాల్లో ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం చేశారని, కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన తరువాత మహిళా పారిశ్రామికవేత్తలకు మంచి ప్రోత్సాహం అందుతుండడంతో ఏపీకి వచ్చి వ్యాపారం ప్రారంభించినట్లు విజయవాడకు చెందిన అనుష అనే మహిళ తెలిపింది.నేను 12 ఏళ్లు హైదరాబాద్‌లో జాబ్ చేశాను. ఆ అనుభవంతోనే ఈ బిస్కెట్ తయారీ వ్యాపారం చేసేందుకు ముందుకు వచ్చాను. నాకు ఎప్పటి నుంచో వ్యాపారం చేయాలని ఆసక్తిగా ఉండేది. కానీ ఇంతకు ముందు ఉన్న ప్రభుత్వం నుంచి ఎటువంటి సపోర్ట్ రాలేదు. కానీ ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత లోన్లు తొందరగా అనుమతిస్తున్నారని తెలిసి, మీవీజులో లోన్ అప్లై చేశాను. ఆ తర్వాత మహిళా డ్వాక్రా గ్రూప్‌లో జాయిన్ అయ్యాను. ప్రస్తుతం నా దగ్గర 15 మంది ఈ బిస్కెట్స్ తయారు చేస్తున్నారు. అందులో 14 మంది మహిళలే వర్కర్లుగా పని చేస్తున్నారు. మహిళా సాధికారతను పెంచాలనే ఆలోచనలతో ఈ బిజినెస్‌ను ముందుకు తీసుకువెళ్తున్నాను. -అనుష మహిళా పారిశ్రామికవేత్తఆన్ లైన్ లోనూ వ్యాపారం చేసుకోవచ్చు: స్వయం సహాయ సంఘాల బలోపేతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి చొరవ తీసుకుంటున్నారన్న అభిప్రాయం మహిళల నుంచి వ్యక్తమౌతోంది. మహిళలు వారి ఉత్పత్తులను అమ్ముకోవడానికి అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శనలు నిర్వహిస్తోంది. పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని డ్వాక్రా సంఘాల మహిళలు వారి ప్రొడక్ట్స్‌ను అమ్ముకునే అవకాశం కల్పిస్తోంది. ఆన్ లైన్ లోనూ స్వయం సహాయ సంఘాల మహిళలు బిజినెస్ చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. దీంతో వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు తోడ్పాటు అందిస్తోంది.2047 లక్ష్యాలను చేరేందుకు: మెప్మా, డీఆర్డీఏ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనేక ఎగ్జిబిషన్లు, ఉత్సవాలు నిర్వహిస్తూ మహిళల వ్యాపారాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇలాంటి ఎగ్జిబిషన్లలో స్వయం సహాయ సంఘాల సభ్యులకి ఉచితంగా స్టాల్స్‌ను కేటాయిస్తూ వారి బిజినెస్ పెంచుకునేందుకు తోడ్పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్దేశించుకున్న

# భాగ్యనగరంలో గ్రీన్ ట్యాక్స్ కష్టాలు

**రోడ్లపైకి రావాలంటే ఫైన్ వేస్తారని భయం**

**గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాలం చెల్లిన పాత వాహనాలు**

**గ్రీన్ ట్యాక్స్ చెల్లించడానికి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న వాహనదారులు**

**మీ-సేవ కేంద్రాల్లో తలెత్తుతున్న సాంకేతిక లోపాల కారణంగా నగదు చెల్లింపుల్లో సమస్యలు**



గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాలం చెల్లిన పాత వాహనాలు ఉన్నాయి. అయితే ఈ వాహనాలకు సంబంధించిన యజమానులు గ్రీన్ ట్యాక్స్ చెల్లించడానికి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సాధారణంగా 15 సంవత్సరాలు పూర్తయిన వాహనాలను రోడ్లపై తిప్పరాదు. అయితే వాహన పరిస్థితి మెరుగైన రీతిలో ఉంటే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవచ్చు. ఇలా వాహనంపై తిరిగి అనుమతి పొందాలంటే గ్రీన్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. దీనికోసం రవాణా శాఖ వెబ్‌సైట్లో అప్లై చేసుకోవచ్చు లేదా మీ-సేవా కేంద్రాల్లోనూ దీనిని పూర్తి చేసుకోవచ్చు. అయితే మీ-సేవ కేంద్రాల్లో తలెత్తుతున్న సాంకేతిక లోపాల కారణంగా నగదు చెల్లింపులు జరగడం లేదు. దీంతో గడువు ముగిసిన వాహనాల యజమానులు జరిమానాల భయంతో వాహనాలను రోడ్లపై నడపలేకపోతున్నారు.రోడ్డుపైకి వస్తే జరిమానా భయం : మల్కాజిగిరికి చెందిన కె. రామ్మోహన్ హరిత పన్ను చెల్లించడానికి వారం రోజులుగా మీ- సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. మీ-సేవలో గ్రీన్ ట్యాక్స్ ఆప్షన్ తెరుచుకోవడం లేదు. ఆర్టీఏ వెబ్‌సైట్‌లో ట్యాక్స్ కడదామనుకుని స్లాట్ బుక్ చేస్తే అది పూర్తి కావడం లేదు. పైగా ఇప్పుడు తన వాహన ఫిట్‌నెస్ గడువు ముగిసిపోయింది. దీంతో అధికారులు జరిమానా విధిస్తారేమో అనే అనుమానంతో తన వాహనాన్ని బయటకు తీయడంలేదని అయన చెప్పుకొచ్చారు.గడువు తీరితే జరిమానా : హైదరాబాద్‌లో వివిధ ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో వేల సంఖ్యలో గడువు దాటిన వాహనాలు ఉన్నాయి. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం 15 సంవత్సరం దాటిన కార్లకు రూ.5 వేలు, ద్విచక్ర వాహనాలకు రూ.2 వేలు హరిత పన్ను చెల్లించి రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ (ఆర్సీ రెన్యువల్) చేసుకోవాల్సి ఉంటుంది. అది అయిదేళ్ల వరకు చెల్లుబాటు అవుతుంది.రూ.500 వరకు జరిమానా : అయితే ఈ ప్రక్రియను వాహన గడువు ముగిసేలోపే ఈ చెల్లింపులు ప్రక్రియ పూర్తి చేయాలి. ఇలా సకాలంలో చెల్లిస్తే దీనికోసం ఎలాంటి అదనపు జరిమానా చెల్లించాల్సిన అవసరం ఉండదు. అదే గడువు ముగిసిన తర్వాత పన్ను చెల్లిస్తే నెలకు రూ.500 వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అయితే సీఎన్జీ, ఎలక్ట్రిక్ వాహనాలకు హరిత పన్ను నుంచి ప్రభుత్వం మినహాయించింది.పెరుగుతున్న అపరాధ రుసుము : మీ- సేవకు వెళ్లి రుసుము చెల్లిద్దాం అనుకుంటే సర్వర్ డౌన్ లేదా డేటా నాట్ ఫౌండ్ అనే సమాధానాలు వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో సొంతంగా స్లాట్ బుకింగ్ చెసుకుందామనుకుంటే మొబైల్ ఫోన్‌కు ఓటీపీలు రాకపోడం, పేమెంట్ ఫెయిల్ కావడం వంటి అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో రోజులు గడుస్తున్నా పని పూర్తి కాకపోవడంతో వాహనదారులంతా వేచి చూడాల్సి వస్తుంది.వానహ యజమానికి ఆర్థిక నష్టం : వాహనం తీసుకుని 15 సంవత్సరాలు పూర్తి కావడంతో దీనికోసం గ్రీన్ ట్యాక్స్ చెల్లించాలి. అలా చెల్లించకపోతే సంబంధిత వాహనానికి బీమా వర్తించదు. దీంతో వాహనానికి ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే వాహనదారులకు సాయం లభించదు. దీంతో వానహ యజమానికి ఆర్థిక నష్టం జరుగుతుంది. అనకే కారణాలతో ఈ ట్యాక్స్ కట్టడం కాస్త ఆలస్యమైతే అధిక రుసుము చెల్లించాల్సి వస్తుంది. సాంకేతిక సమస్యల గురించి అధికారులకు చెప్పినా ఈ వాహనాలకు రూ. 500 వరకు అదనపు జరిమానా విధిస్తుండటంతో వాహనదారులు ప్రభుత్వ యంత్రాగం తీరుపై మండిపడుతున్నారు. ఈ సమస్యపై అధికారులకు చెబుతున్నా మీ సేవ కేంద్రాల్లోనే ఈ తరహా సమస్యలు వస్తున్నాయంటూ జవాబిస్తున్నారు.

# వసంతం మాయం - మార్చిలోనే మండుతున్న ఎండలు

**ముంచుకొస్తున్న 'హీట్ స్ట్రెస్'**

**శీతాకాలం వెళ్లగానే మొదలైన వేసవి తాపం**

**ప్రకృతి ఆనవాళ్లు దెబ్బతిన్న వైనం**

**వాతావరణ మార్పుల వల్లే ఈ విపరీతం అంటున్న నిపుణులు**

**కర్నూలులో అప్పుడే 39 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత**



ఒకప్పుడు ఫాల్గుణ మాసం రాగానే ప్రకృతి పులకరించిపోయేది. ఆకులు రాల్చిన చెట్లు కొత్తగా చిగురు తొడిగేవి. కోకిల గానంతో వసంత రుతువు ఆహ్వానం పలికేది. పగలు వెచ్చగా, రాత్రి చల్లగా వాతావరణం ఎంతో ఆహ్లాదభరితంగా ఉండేది. ముఖ్యంగా మార్చి, ఏప్రిల్ నెలలు అంటేనే వసంతానికి కేరాఫ్ అడ్రస్. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వసంతం రాక ముందే వేసవి మంటలు మొదలయ్యాయి. మార్చి నెల ప్రారంభం కాకముందే ఎండలు మండిపోతున్నాయి. అసలు వసంత రుతువు ఉందా? లేదా? అనే అనుమానం కలుగుతోంది. వాతావరణంలో వస్తున్న అనూహ్య మార్పుల వల్లే ఈ పరిస్థితి దాపురించిందని, భవిష్యత్తులో వేడి తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.కనుమరుగవుతున్న వసంత రుతువు : కొన్నేళ్లుగా మార్చిలోనే వేసవి తరహా ఎండలు దంచికొడుతున్నాయి. గడిచిన రెండేళ్లుగా అయితే వసంత రుతువు వచ్చినట్లు కూడా ఎవరికీ తెలియడం లేదు. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న అనూహ్య వాతావరణ పరిస్థితులు దీనికి ప్రధాన కారణం. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోతున్నాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లోనే పలు ప్రాంతాల్లో వడగాలులు వీయడం ఇప్పుడు సర్వసాధారణంగా మారిపోయింది. తీవ్రమైన పట్టణీకరణ, కాంక్రీట్ జంగిల్స్ పెరగడం, పచ్చదనం తగ్గిపోవడం ఈ ముప్పును మరింత పెంచుతున్నాయి.ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి : దేశంలో ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే సగటు ఉష్ణోగ్రతలు 1.07 డిగ్రీలు పెరిగాయి. దక్షిణ భారతదేశంలో పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉన్నా, మిగతా ప్రాంతాల్లో ఎండలు రికార్డు స్థాయిలో మండుతున్నాయి. మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అప్పుడే ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు దాటేశాయి. ఇటీవల కర్నూలులో గరిష్ఠంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ముఖ్యంగా కోస్తా ప్రాంతాల్లో పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ ఎండ వేడికి సముద్రపు తేమ కూడా తోడవుతోంది. దీంతో ఉష్ణోగ్రత 32 డిగ్రీలే ఉన్నా, ప్రజలకు మాత్రం 35 డిగ్రీల ఎండలో ఉన్నంత ఉక్కపోత, అసౌకర్యం కలుగుతోంది.మూగజీవాలు, కూలీలపై తీవ్ర ప్రభావం : రాష్ట్రంలో ఈ నెలలోనే వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇప్పటికే ప్రకటించింది. అయితే వడగాలుల కంటే ముందు 'హీట్ స్ట్రెస్' ప్రభావం తీవ్రంగా ఉంటుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల మనుషుల్లో వేగంగా అలసిపోయి, పనిచేసే శక్తి సన్నగిల్లుతుంది. ఉష్ణోగ్రత 32 డిగ్రీలు దాటితే మూగజీవాలు విలవిల్లాడుతాయి. కోళ్లు, మేకలు, గొర్రెలు తీవ్ర ఇబ్బంది పడతాయి. పశువులపై ఈ వేడి ప్రభావం పడి, పాల ఉత్పత్తి కూడా భారీగా తగ్గిపోతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఆరుబయట ఎండలో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, డెలివరీ బాయ్స్ (గిగ్ వర్కర్లు) తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. దీనివల్ల ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవనాధారంపై, ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడుతుంది."ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం వడగాలులనే కాకుండా, 'హీట్ స్ట్రెస్' ప్రభావాన్ని కూడా మనం తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వాలు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. మైదాన ప్రాంతాల్లోనే కాదు, ఇప్పుడు పర్వత ప్రాంతాల్లోనూ వేడి తీవ్రంగా పెరుగుతోంది. భూతాపం (గ్లోబల్ వార్మింగ్) కారణంగా వాతావరణంలో శరవేగంగా మార్పులు జరుగుతున్నాయి. ఈ మార్పులను తట్టుకునేందుకు ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా సన్నద్ధం కావాలి. ఒకే ఉష్ణోగ్రత, ఒక్కో భౌగోళిక ప్రాంతంలో వేర్వేరు రకాల ప్రభావాలను చూపిస్తుంది. వాతావరణ మార్పులపై ప్రభుత్వం ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలి.

# కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు సింఘ్వీ సంపాదన రోజుకు రూ.కోటి!

**కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు సింఘ్వీ ఆస్తులు రూ.2,558 కోట్లు**

**వ్యక్తిగత చరాస్తుల విలువ రూ.1,536 కోట్లు, భార్య అనిత చరాస్తుల విలువ రూ.568 కోట్లు**

**ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న సింఘ్వీ**



సుప్రీంకోర్టులో ఆయన ఓ ప్రముఖ న్యాయవాది. మంచి లాయర్ అయితే కోట్లు సంపాదిస్తాడని అంటారు. కానీ అభిషేక్ మను సింఘ్వీ విషయంలో ఇది అక్షరాల నిజం. తెలంగాణ నుంచి రాజ్యసభ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన సింఘ్వీ అఫిడవిట్ చూస్తే ఆ విషయం స్పష్టమవుతుంది. ప్రతి రోజూ 80లక్షల నుంచి కోటి రూపాయలు తన సంపాదనగా ఉన్నట్లు వెల్లడించారు. ఎలాంటి దాపరికం లేకుండా పారదర్శకంగా ప్రతి విషయాన్ని పొందుపరిచిన అభిషేక్ మను సింఘ్వీ తనకు, తన కుటుంబానికి దాదాపు రూ.2558 కోట్లు విలువ చేసే స్థిరచరాస్తులు ఉన్నట్లు నామినేషన్ అఫిడవిట్‌లో వెల్లడించారు. అందులో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు.అభిషేక్ మను సింఘ్వీ దిల్లీలో పుట్టి పెరిగారు. ఆయన సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఎకనామిక్స్ ఆనర్స్ విద్యనభ్యసించిన తర్వాత ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ విద్యను పూర్తి చేసి, 1986లో పీహెచ్‌డీ సాధించారు. అక్కడితో ఆగలేదు. 1987లో హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఒక ప్రత్యేక కోర్సును చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలైన కేంబ్రిడ్జ్, హార్వర్డ్ రెండు విశ్వవిద్యాలయాల్లో చదివిన సింఘ్వీ వృత్తిరీత్యా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదిగా స్థిరపడ్డారు. దేశంలో రాజ్యాంగంపై మంచి పట్టున్న, పేరు ప్రఖ్యాతులు కలిగిన న్యాయ నిష్ణాతుల్లో ఆయన ఒకరుగా చెప్పవచ్చు.నెలకు రూ.30కోట్ల సంపాదన : తెలంగాణ నుంచి ఎమ్మెల్యేల కోటా కింద రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సింఘ్వీ అఫిడవిట్ పరిశీలిస్తే 2020-21లో ఆయన ఆదాయం రూ.158 కోట్లు, 2021-22 ఆర్థిక ఏడాది అది రూ.290 కోట్లకు ఎగబాకింది. 2022-23లో రూ.359 కోట్లుకు చేరింది. 2023-24లో రూ.333 కోట్లు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.374 కోట్ల ఆదాయం ఉన్నట్లుగా ఐటీ రిటర్న్‌లో చూపించారు. సగటున ఆయన రాబడిని లెక్క వేస్తే ప్రతి నెలా 25 నుంచి 30 కోట్లు. ప్రతి రోజూ దాదాపు 80 లక్షల నుంచి కోటి రూపాయలు. ఇది ఒక న్యాయవాది సంపాదన. న్యాయవాది వృత్తి, పెట్టుబడుల రాబడి, ఎంపీ పెన్షన్ ఇవన్నీ కలిపితే వచ్చిన మొత్తం ఇది. ఇక ఆయన భార్య అనితా సింఘ్వీ గజల్, సూఫీ గానంలో నిపుణురాలు. ఆమె కూడా 2024-25లో 4.67 కోట్లు సంపాదించారు. సంగీతం కూడా ఇక్కడ కోట్లు తెచ్చిపెడుతున్నట్లు ఆమె ఐటీ రిటర్న్‌లు చూస్తే స్పష్టమవుతోంది.అత్యంత విలువైన భవనాలు : దిల్లీలో అత్యంత ధనవంతులు నివాసం ఉండే ప్రీమియమ్ ప్రాంతాల్లో సింఘ్వీ భార్య అనితా సింఘ్వీ పేరుతో నాలుగు ఆస్తులు ఉన్నాయి. సందర్ నగర్‌లో ఫ్లాట్, నీతి బాగ్‌లో 50 శాతం వాటా ఉన్న ఇల్లు, 14 జోర్ బాగ్, 30 గోల్ఫ్ లింక్స్. ఈ నాలుగింటి మొత్తం మార్కెట్ విలువ రూ.333కోట్లుగా చూపించారు. సింఘ్వీ స్వయంగా కూడా నీతి బాగ్, సందర్ నగర్‌లో ప్రాపర్టీలు కలిగి ఉన్నారు, వాటి విలువ 55 కోట్లుగా పేర్కొన్నారు. ముంబయి సమీపంలో అలీబాగ్ దగ్గర ఒక ఎకరం వ్యవసాయ భూమి, హిందూ అవిభక్త కుటుంబం పేరిట దిల్లీ సమీపంలో 2.5 ఎకరాల భూమి ఉన్నట్లు పేర్కొన్న ఆయన స్థిరాస్తుల మొత్తం విలువ రూ.453 కోట్లుగా వెల్లడించారు.సింఘ్వీ మొత్తం చర, స్థిరాస్తులు ఎంతంటే? : సింఘ్వీ అఫిడవిట్‌లో పొందుపరచిన వివిధ పెట్టుబడులను పరిశీలిస్తే ఆయన ఒక్క చోట మాత్రమే డబ్బు పెట్టుబడి పెట్టే వ్యక్తి కాదని స్పష్టమవుతోంది. షేర్ మార్కెట్‌లో లిస్టెడ్ కంపెనీల్లో రూ.190 కోట్లు, అన్‌లిస్టెడ్ కంపెనీల్లో రూ.33 కోట్లు మ్యూచువల్ ఫండ్స్‌లో రూ.197 కోట్లు ప్రత్యేక ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌లో రూ.203 కోట్లు పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీస్‌లో మరో రూ.140 కోట్లు పెట్టుబడి పెట్టారు. అవి మాత్రమే కాకుండా బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీలో కూడా రూ.8.17 కోట్లు పెట్టుబడి పెట్టారు. అంతేకాదు ఇంట్లో గోడలకు వేలాడే పెయింటింగ్స్, కళాఖండాల విలువ రూ.25.60 కోట్లుగా పేర్కొన్నారు. లండన్‌లో ఐసీఐసీఐ బ్యాంకులో విదేశీ ఖాతాలు కూడా ఉన్నాయి. ఇక భార్య అనితా సింఘ్వీ పెట్టుబడులు చూస్తే పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీస్‌లో మాత్రమే రూ.293 కోట్లు ఉన్నాయి. ఆమె మొత్తం చరాస్తులు రూ.568 కోట్లుగా పేర్కొన్నారు. సింఘ్వీ రూ.1536 కోట్ల చరాస్తులు కలిగి ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడించారు. కుటుంబం మొత్తం చర, స్థిరాస్తులు కలిపితే దాదాపు రూ.2558కోట్లు ఉందని స్పష్టమవుతోంది.కేసుల వివరాలు ఇవే : సింఘ్వీ తనపై క్రిమినల్ కేసు పెండింగ్ ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 2010-11 నుంచి 2012-13 సంవత్సరాలకు సంబంధించి ఆదాయపు పన్నుశాఖ జోధ్‌పూర్ కోర్టులో కేసు దాఖలు చేసింది. ఖర్చులు పెంచి చూపించి ఆదాయపు పన్ను ఎగవేశారని తన పిటిషన్‌లో ఆరోపించింది. కానీ ఆ కేసులో ఇప్పటి వరకు ఎటూ తేలలేదు. పెండింగ్ ఉంది. 2014లో రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన స్టే ఇప్పటికీ అమలులో ఉంది. ఆయన ఎలాంటి నేరంలోనూ శిక్ష అనుభవించలేదు. ఇక అప్పులు, బకాయిల విషయానికి వస్తే అప్పు ఒక్క రూపాయి కూడా లేదు. ప్రభుత్వానికి బకాయి కూడా లేదు. దిల్లీలో లోధీ ఎస్టేట్‌లో ప్రభుత్వ బంగ్లా వాడుతున్న తాను అద్దె, విద్యుత్, నీరు ఆయన ఏ బకాయీ లేనట్లు రాజ్యసభ సెక్రటేరియట్ ధ్రువీకరించింది.

ఇవీ రాజ్యసభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సింఘ్వీ పేరున ఉన్న స్థిర చరాస్థుల విలువ

సింఘ్వీ పేరున చరాస్తుల విలువ రూ.1536 కోట్లు

ఆయన భార్య పేరున చరాస్థుల విలువ రూ.568 కోట్లు

హెచ్‌యుఎఫ్ విభాగంలో చరాస్తుల విలువ రూ. 51లక్షలు

**స్థిరాస్తుల విలువ :**

సింఘ్వీ పేరున స్థిరాస్తుల విలువ రూ.60 కోట్లు

ఆయన భార్య అనిత పేరున స్థిరాస్థుల విలువ రూ.333 కోట్లు

హెచ్‌యు ఎఫ్ పేరు చరాస్తుల విలువ రూ. 60 కోట్లు

సింఘ్వీ పేరున మొత్తం ఆస్తుల విలువ రూ.1596 కోట్లు

ఆయన భార్య అనిత పేరు మొత్తం ఆస్తుల విలువ రూ.901 కోట్లు

హెచ్‌యు ఎఫ్ పేరు మొత్తం ఆస్తుల విలువ రూ. 60.51 కోట్లు

మొత్తం సింఘ్వి ఆస్తుల విలువ రూ.2558.24 కోట్లు

# వ్యవసాయ కుటుంబం నుంచి పెద్దల సభకు

**వేం నరేందర్ రెడ్డి ఆస్తులు, అప్పులు ఇవే**

**రాజ్యసభకు ఎంపికైన వేం నరేందర్ రెడ్డి**

**రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం**

**ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తిపాస్తుల వెల్లడి**



తెలంగాణ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన వేం నరేందర్ రెడ్డి వ్యవసాయ కుటుంబానికి చెందిన నాయకుడు. ఆయన మహబూబాబాద్ జిల్లా కే సముద్రం మండలం అర్పనపల్లి వాసి. అరవై ఏడేళ్ల వయస్సు కలిగిన ఆయనకు రాజకీయాల్లోనూ నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవమూ ఉంది. ఆయన రాజ్యసభ నామినేషన్ వేసిన సమయంలో అఫిడవిట్‌లో తన ఆస్తిపాస్తుల ముఖచిత్రాన్ని సైతం బయట పెట్టారు. అవేంటో ఈ కథనం ద్వారా చూద్దాం.కుటుంబ వార్షిక ఆదాయం నలభై ఐదు లక్షలు : వేం నరేంద్ర రెడ్డి తాను వేసిన అఫిడవిట్‌లో అయిదేళ్ల కిందట తన వ్యక్తిగత ఆదాయం ఆరు లక్షల ముప్పై వేలు మాత్రమే ఉన్నట్లు చూపించారు. 2024-25 ఆర్థిక ఏడాదికి ఇరవై రెండు లక్షలకు పెరిగింది. ఆయన సతీమణి ఆదాయం పది లక్షలపైన ఉన్నట్లు అందులో పేర్కొన్నారు. హెచ్‌యూఎఫ్ ద్వారా మరో పన్నెండు లక్షలు ఆదాయం ఉన్నట్లు తెలిపారు. అంతా కలిపితే కూడా కుటుంబం మొత్తం వార్షిక ఆదాయం దాదాపు నలభై ఐదు లక్షలుగా పేర్కొన్నారు.పెట్టుబడుల రూపంలో ఉన్నవి : బ్యాంకు బాలెన్సులు, నగదు, నగలు కలిపితే అభ్యర్థి చేతిలో నలభై రెండు లక్షలు, సతీమణి దగ్గర రెండు కోట్ల ఇరవై ఏడు లక్షలు ఉన్నట్లు వివరించారు. ఆయన సతీమణి పేరున కోల్డ్ కేర్ లాజిస్టిక్స్‌లో ఆరువందలు ఇరవై ఐదు వేల షేర్లు ఉన్నట్లు వాటి విలువ డెబ్భై ఐదు లక్షలుగా వెల్లడించారు. అస్త్రా కృష్ణ హాస్పిటాలిటీ, హెల్త్ సర్వీసెస్ పేర పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్‌లలో మరో ఇరవై లక్షల పెట్టుబడులు ఉన్నట్లు వివరించారు.వంశపారం పర్యంగా వచ్చినవి : స్థిరాస్తుల విషయానికి వస్తే కుటుంబం మరింత బలంగా కనిపిస్తోంది. వేం నరేంద్ర రెడ్డి భార్య పేరున కేసముద్రం వద్ద ఏడున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు దాని విలువ రెండు కోట్లుగా పేర్కొన్నారు. హెచ్‌యూఎఫ్ పేర అర్పనపల్లిలో పదిహేను ఎకరాలకుపైన వంశపారం పర్యంగా వచ్చిన పొలాలు ఉన్నట్లు వాటి విలువ మరో మూడున్నర కోట్లు ఉంటుందని వివరించారు. ఇక వరంగల్, హైదరాబాద్ మాధాపూర్, కే సముద్రంలో మూడు వ్యాపార కట్టడాలు ఉండగా వాటి విలువ సుమారు పదిహేడు కోట్లకుపైగా ఉంటుందని తెలిపారు. నివాస గృహాలు హానుమకొండ, హైదరాబాద్ గచ్చిబౌలి, కే సముద్రంలలో ఉన్నాయని చెప్పారు. వీటన్నింటి విలువతో కలిపి మొత్తం కుటుంబ స్థిరాస్తుల విలువ నలభై కోట్లకుపైగా ఉంటుందని స్పష్టం చేశారు.దాదాపు నలభై కోట్ల విలువైన ఆస్తులు : ఇక అప్పుల విషయానికొస్తే అభ్యర్థి వేం నరేంద్ర రెడ్డి హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్‌కు ఇరవై నాలుగు లక్షల డెబ్భై తొమ్మిది వేలు, సతీమణి యాక్సెస్ బ్యాంక్‌కు నూట ముప్పై ఎనిమిది లక్షలు బాకీ ఉన్నట్లు తెలిపారు. ఈ అఫిడవిట్‌లో అత్యంత కీలకమైన విషయంగా చెప్పుకునేదేమిటని చూస్తే వేం నరేందర్ రెడ్డిపై ఒక్క క్రిమినల్ కేసు లేదు ఎటువంటి శిక్ష అనుభవించలేదని స్పష్టం చేశారు. సొంత ఆదాయం, సతీమణి వ్యాపారం, హెచ్‌యూఎఫ్ మూడు వనరుల నుంచి వచ్చే ఆదాయం దాదాపు నలభై కోట్లకు పైగా విలువైన ఆస్తులు ఉంటాయని వెల్లడించారు.వేం నరేంద్ర రెడ్డి పేరు మీద ఆస్తుల విలువ రూ. 20 కోట్లు, ఆయన సతీమణి పేరు మీద ఆస్తుల విలువ రూ. 15.25 కోట్లు, కుటుంబ ఉమ్మడిగా ఆస్తి విలువ రూ. 3.50 కోట్లు. మొత్తం ఆస్తుల విలువ రూ. 38.75 కోట్లుగా ఆయన అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com